# సంక్షేమం, అభివృద్ధి లక్ష్యం



జెండా ఎగురవేస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

పెద్దపల్లి, జనవరి26(నమస్తే తెలంగాణ): పెద్దపల్లి జిల్లా ప్రజల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం, జిల్లా అధికార యంత్రాంగం పని చేస్తుందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. ఆదివారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా సమీకృత జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్వహించిన వేడుకలలో పెద్దపల్లి, రామగుండం ఎమ్మెల్యేలు చింతకుంట విజయ రమణారావు, మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్‌తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా కలెక్టర్ పోలీసు గౌరవం వందనం స్వీకరించి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లా ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, రేషన్ కార్డు నూతన పథకాలు జిల్లాలో ప్రారంభించామని తెలిపారు. అర్హులైన చివరి లబ్ధిదారుడి వరకు ప్రతి సంక్షేమ పథకం అమల వుతుందని, ఎవరు ఎటువంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదన్నారు. గ్రామ సభల ద్వారా ప్రాథమికంగా ఇందిరమ్మ ఆత్మీయ బరోసాకు 13, 638 మంది, 12, 705 నిరుపేద కుటుంబాలను నూతన రేషన్ కార్డు జారీకు ఎంపిక అయ్యారని వెల్లడించారు. ఇందిరమ్మ ఇండ్లకు

**కలెక్టర్ కోయ శ్రీహర్ష**

మొదట విడతలో అత్యంత పేదలు, సొంత సాగ ఉన్న వారిని నియోజక వర్గానికి 3500 మందిని గుర్తించామన్నారు. జిల్లాలో సాగుకు యోగ్యం కానీ వ్యవసాయ భూమి 2, 196 ఎకరాలు గుర్తించామని, సాగే చేసే భూములకు యాసంగి పంట నుంచి పెట్టుబడి సాయం రైతు బరోసా పథకం కింద ఎకరాకు రూ. 12వేల చొప్పులను రైతుల ఖాతాలో జమ చేస్తామని చెప్పారు.

**రైతు సంక్షేమం...**

జిల్లాలో 58, 896 మంది రైతులకు రూ. 446 కోట్ల 54 లక్షల మేర రూ. 2 లక్షల రుణ మాఫీ చేసిశామని చెప్పారు. వానకాలం సీజన్‌లో 26, 652 మంది రైతుల నుంచి 2. 29 లక్షల క్వింటాళ్లకు పైగా సన్న రకం ధాన్యం కొనుగోలు చేసి రూ. 85 కోట్ల 33 లక్షల బోనస్ అందించామన్నారు.భారీ వర్షల వల్ల దెబ్బతిన్న 108 ఎకరాల 36 గుంటల భూమికి సంబంధించి రైతులకు రూ. 10 .89లక్షల పరిహారం అందించామని తెలిపారు. రూ. 1. 31 కోట్లు సబ్సిడీ విడుదల చేసి జిల్లాలో 2866 ఎకరాలలో ఆయిల్ ఫామ్ ప్లాంటేషన్ చేశామని వెల్లడించారు.

అలాగే మహాలక్ష్మి, గృహజ్యోతి పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ దవాఖానల్లో మెరుగైన వైద్య సేవలందించేందకు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా జిల్లాలోని 477 పాఠశాలల్లో రూ. 15. 54 కోట్లు ఖర్చు చేసి మౌళిక వసతులు కల్పించామన్నారు. పెద్దపల్లిలో బస్సు డిపో ఏర్పాటుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎంపీడీవో ప్రాంగణంలోని భూమిని ఆర్టీసీ అప్పగించామన్నారు. గణతంత్ర దినోత్సవ సందర్భంగా చైతన్య జ్యోతి జిల్లా మహిళా సమాఖ్య ద్వారా స్వశక్తి మహిళా సంఘాలకు రూ. 102 కోట్ల 11 లక్షల 50 వేలు, మెప్మా ద్వారా మరో 113 స్వశక్తి సంఘాలకు రూ. 14 కోట్ల 62 లక్షల 50 వేల బ్యాంకు లింకేజీ రుణాలను పంపిణీ చేశామని చెప్పారు. అనంతరం విధి నిర్వాహణ ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు ప్రశంస ప్రతాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా జడ్జి డాక్టర్ హేమంత్ కుమార్, జూనియర్ సివిల్ జడ్జి ఎన్ మంజుల, అదనపు కలెక్టర్లు జల్ద అరుణ శ్రీ, దాసరి వేణు, డీసీపీ ఎం.చేతన, పెద్దపల్లి ఆర్డీవో బీ గంగయ్య, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

**అలరించిన మ్యూజికల్ నైట్**

జ్యోతినగర్, జనవరి 26: ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లోని సెయింట్‌క్లేర్ పాఠశాల క్రీడామైదానంలో ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన మ్యూజికల్ నైట్ ప్లేబ్యాక్ సింగర్స్, ఆర్కెస్టు బృందం నృత్యప్రదర్శనతో అలరించింది. ఎన్టీపీసీ సీజీఎం చందన్‌కుమార్ సమంత, దీప్తి మహిళా సమితి అధ్యక్షురాలు రాఖీ సమంతలు ముఖ్యఅతిథులుగా హాజరై జ్యోతిప్రజ్వలన చేయగా గాయకులు రోహిత్, శిరిష, లాస్యప్రియలు తమ పాటలతో ఉద్యోగులను అలరింపచేశారు.



స్వశక్తి సంఘాలకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ శ్రీహర్ష



గణతంత్ర వేడుకలకు హాజరైన ప్రజలు

## ఉత్తమ సేవలకు పురస్కారం



## రోడ్డు భద్రతపై విస్తృత ప్రచారం

పెద్దపల్లి, జనవరి26: జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు -2025లో భాగంగా టాటా ఏస్ వాహనంపై ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా రోడ్ సేఫ్టీపై జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఆదివారం కలెక్టరేట్ వద్ద ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా ట్రాఫిక్ రూల్స్, ప్రమాదాలు జరిగే తీరు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను క్లుప్తంగా వివరించారు. ఎల్ఈసీ స్క్రీన్ ద్వారా ట్రాఫిక్ నియమాలను వివరించటం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆర్టీవో రంగారావు మాట్లాడారు. ఈనెల 1 -31 వరకు జాతీయ రహదారుల భద్రత మాసోత్సవాలను జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. పాదాచారులు, ద్విచక్రవాహనదారులు, ఆటో, కారు, లారీ, బస్సు, ఇతర వాహనాలు నడిపే డ్రైవర్లు ట్రాఫిక్ రూల్స్ పాటినప్పుడే, రోడ్డు ప్రమాదాలను తగ్గుతాయని పేర్కొన్నారు.

## అలరించిన సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు

పెద్దపల్లి, జనవరి26: 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా నృత్యాలు చేశారు. సాంస్కృతిక సారథి కళాకారుల సైతం దేశభక్తి గేయాలు పాడి వీక్షకుల్లో ఉత్సాహం నింపారు. జిల్లా అధికారులు సాంస్కృతిక ప్రదర్శనలు తిలకించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థినులు, సాంస్కృతిక సారథి కళాకారులను అదనపు కలెక్టర్ అభినందించి ప్రశంస పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు.

### 200 నేత్రదానాలకు ప్రశంస

ఓదెల, జనవరి 26: ఓదెల గ్రామంలో 200 నేత్రదానాలను పూర్తి చేసి రాష్ట్రస్థాయిలో రికార్డు సృష్టించిన సదాశయ ఫౌండేషన్ బాధ్యుడు, మాజీ సర్పంచ్‌ను రిపబ్లిక్ డే సందర్భంగా ఆదివారం కలెక్టర్ కోయ శ్రీహర్ష అభినందించి ప్రశంసాపత్రం అందజేశారు. సదాశయ ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి మేర్గు భీష్మాచారి, మాజీ సర్పంచ్ ఆకుల మహేందర్ సామాజిక సేవ కార్యక్రమాలతో ఆదర్శంగా నిలుస్తున్నారని పేర్కొన్నారు.

## ప్రజాభిప్రాయ సేకరణ ఏర్పాట్ల పరిశీలన

జ్యోతినగర్, జనవరి 26: ఎన్టీపీసీ తెలంగాణ ప్రాజెక్టు స్టేజీ 2 కింద చేపట్టనున్న 2400మెగావాట్ల ప్రాజెక్టుకు ఈ నెల 28న జరుగనున్న ప్రజాభిప్రాయ సేకరణ ఏర్పాట్లను రామగుండం పోలీసు కమిషనర్ ఎం శ్రీనివాస్ ఆదివారం పరిశీలించారు. ఎన్టీపీసీ టీటీఎస్‌లోని జిల్లా పరిషత్ హైస్కూల్ క్రీడామైదానంలో చేపట్టిన ఏర్పాట్లను కలెక్టర్ కోయ శ్రీహర్ష, డీసీపీ చేతనతో కలిసి సభా వేదిక, స్టేజీ ఏర్పాటు, వీఐపీ, జనరల్ పార్కింగ్ స్థలాలు, బారికేడ్ల ఏర్పాట్లను పరిశీలించారు.

# రాబడి

## యూపీఎస్ వచ్చేస్తోంది..

### ఏప్రిల్ 1 నుంచి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు అమలు

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ (యూపీఎస్) అమలును మోదీ సర్కారు ప్రకటించింది. పదవీ విరమణ పొందినవారికి పింఛన్ హామీ, ఆర్థిక భద్రతలే లక్ష్యంగా పాత పెన్షన్ స్కీమ్ (ఓపీఎస్), జాతీయ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్) రెండింటి ప్రయోజనాలను కలగలిపి ఈ యూపీఎస్‌ను కేంద్రం తీసుకొచ్చింది. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఇది అమల్లోకి రానున్నది. అయితే అర్హులైనవారికి ఈ యూపీఎస్ ఎలాంటి పరిస్థితుల్లో వర్తిస్తుందో కూడా ఇందులో పేర్కొన్నారు.

**పదవీ విరమణ**

కనీసం పదేండ్లు ఎంపిక చేసిన సేవలు అందించి, ఆ తర్వాత రిటైరైన ఉద్యోగులకు యూపీఎస్ వర్తిస్తుంది.

**ఎఫ్ఆర్ 56(జే) కింద రిటైర్మెంట్**

పెనాల్టీ ప్రొవిజన్స్ కింద కాకుండా రిటైరైన ప్రభుత్వ ఉద్యోగులే అర్హులు.

**వాలంటరీ రిటైర్మెంట్**

కనీసం 25 ఏండ్లు పనిచేసి, ఆ తర్వాత స్వచ్ఛంధ పదవీ విరమణ తీసుకున్నవారికి రిటైర్మెంట్ వయసు వచ్చాకే పింఛన్.

**ఇలాగైతే రాదు..**

డిస్మిస్, ఉద్యోగం నుంచి తొలగించిన వారు, రాజీనామా చేసినవారికి యూపీఎస్‌ను ఎంచుకొనే అవకాశం ఉండదు.

**యూపీఎస్ ప్రయోజనాలు**

- 25 ఏండ్లు లేదా అంతకుమించి క్వాలిఫైయింగ్ సర్వీస్ ఉన్న ఉద్యోగులకు రిటైర్మెంట్‌కు ముందు చివరి 12 నెలలు అందుకున్న వేతనంలోని సగటు బేసిక్ పేలో 50 శాతాన్ని నెల నెలా పింఛన్‌గా అందిస్తారు. సర్వీస్ 25 ఏండ్ల కంటే తక్కువగా ఉంటే పింఛన్ తగ్గుతుంది.
- క్వాలిఫైయింగ్ సర్వీస్‌లో 10 ఏండ్లు, అంతకుమించి ఉన్న ఉద్యోగులకు నెలకు కనీసం రూ.10,000 పింఛన్‌గా చెల్లిస్తారు. 25 ఏండ్లు పనిచేసి వాలంటరీ రిటైర్మెంట్ తీసుకున్నవారికి, పదవీ విరమణ వయసు వచ్చాకే పింఛన్ మొదలవుతుంది.
- పదవీ విరమణ అనంతరం పింఛన్‌దారుడు చనిపోతే.. ఆ పింఛన్‌లో 60 శాతం భార్య లేదా భర్తకి వస్తుంది.
- నిబంధనలకు లోబడి ఉద్యోగులకు డీఏ తరహాలోనే పింఛన్‌దారుడు, వారు లేకపోతే భాగస్వామికి డియర్‌నెస్ రిలీఫ్‌నూ చెల్లిస్తారు. పింఛన్ మొదలైతేనే వస్తుంది.
- అదనంగా పదవీ విరమణ సమయంలో క్వాలిఫైయింగ్ సర్వీస్‌లోని ప్రతీ ఆరు నెలల కాలానికి నెలవారీ బేసిక్ పే, డీఏలో 10 శాతం చొప్పున లెక్కించి ఎన్నేండ్లయితే అన్నేండ్లకు ఒకేసారి చెల్లిస్తారు. ఈ మొత్తం పింఛన్‌లో తగ్గించరు.

# ఇలా ట్రై చేద్దామా..!

## లో క్యారెట్ గోల్డ్‌కూ డిమాండే



దేశీయంగా బంగారం ధరలు మళ్లీ ఆల్ టైమ్ హైల్లో కదలాడుతున్నాయి. మొన్నటి దాకా తగ్గుముఖం పడుతున్నట్టు కనిపించినా.. తిరిగి పుంజుకున్నాయి. దీంతో చాలా మంది అవసరమైతే తప్ప పసిడి కొనుగోళ్లకు వెళ్లడం లేదు. ఇంకొందరైతే రేట్లు మరింత తగ్గుతాయేమోనని ఎదురుచూస్తు ఉన్నారు. బహిరంగ మార్కెట్‌లో 24 క్యారెట్ గోల్డ్ 10 గ్రాముల విలువ మునుపెన్నడూ లేనివిధంగా రూ.83,000 దాటేసింది మరి. అయితే సరిగ్గా ఇప్పుడే లో క్యారెట్ గోల్డ్.. కొనుగోలుదారులకు చక్కని ప్రత్యామ్నాయంగా కనిపిస్తున్నది. 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత), 22 క్యారెట్ (99.5 స్వచ్ఛత)లే కాకుండా 18, 14, 10 క్యారెట్ బంగారు ఆభరణాలు కూడా దొరుకుతాయి. నిజానికి ఇప్పుడిప్పుడే ఈ లో క్యారెట్ గోల్డ్‌కూ డిమాండ్ కనిపిస్తుండటం మార్కెట్‌లో మారిన ట్రెండ్‌కు నిదర్శనం.

**బడ్జెట్‌కు తగ్గట్టుగా..**

కొనుగోలుదారుల అభిరుచికి తగ్గట్టుగా ఇటీవలికాలంలో బడా జ్యుయెల్లర్స్, ప్రముఖ నగల వర్తకులు సైతం 18 క్యారెట్ బంగారు ఆభరణాలను పెద్ద ఎత్తున తయారు చేస్తున్నారు. మరికొన్ని చిన్నచిన్న జ్యుయెల్లర్స్ 14, 10 క్యారెట్ బంగారు నగలనూ తెస్తున్నారు. పైగా భారతీయ మార్కెట్‌లో మెజారిటీ వాటా మిడిల్ క్లాస్ కస్టమర్లదే కావడంతో జ్యుయెల్లర్స్ దృష్టీ ఈ లో క్యారెట్ విభాగంపై గట్టిగానే పడుతున్నది. ఇక వీటిలోనూ నచ్చిన, రకరకాల డిజైన్లు ఇప్పుడు లభిస్తుండటం విశేషం. దీంతో ఎగువ మధ్యతరగతి నుంచి దిగువ మధ్యతరగతి వర్గాలదాకా అంతా వీటి కొనుగోళ్లకు ఆసక్తి చూపిస్తున్నారు. ముఖ్యంగా యువత కూడా మక్కువ చూపుతున్నది. అలాగే ధర తక్కువ కావడం, ఆకర్షణీయంగా కూడా ఉండటంతో మార్కెట్‌లో వీటికి నానాటికీ డిమాండ్ పెరుగుతూపోతున్నది. అందరి బడ్జెట్‌కు తగ్గట్టుగా అందుబాటులో ఉంటుండటంతో పెండ్లిళ్లు, ఇతర శుభకార్యాలకూ ఎక్కువగా వీటినే ఎంచుకుంటుండటం ఈ మధ్యకాలంలో పెరిగిందనే చెప్పవచ్చు.

**నాణ్యతకు ఢోకా లేదు**

22 క్యారెట్ నుంచి 10 క్యారెట్ వరకు ఆయా ఆభరణాల్లో బంగారం వినియోగం తగ్గుతున్నకొద్దీ వెండి, రాగి, జింక్, నికెల్, పల్లాడియం తదితర లోహాల వాటా పెరుగుతుంది. అందుకే వాటి ధరల్లో అంత తేడా. 22 క్యారెట్ బంగారు ఆభరణాల్లో బంగారం వాటా ఎక్కువగా ఉంటుంది కనుక సహజంగా వీటి రేటు అధికం. 24 క్యారెట్ గోల్డ్ రేటుకు దగ్గర్లోనే పలుకుతుంది. నిజానికి స్వచ్ఛమైన బంగారంతో నగలను తయారు చేయలేం. అందుకే వాటిలో ఇతర లోహాలను కొద్దిగానైనా కలుపుతారు. ఇదే క్రమంలో గోల్డ్ క్యారెట్ తగ్గుతున్నకొద్దీ ఇతర లోహాల పరిమాణం పెరుగుతూపోతుంది. అంతమాత్రం చేత నాణ్యతకు ఢోకా ఉండదు. ఇంకా చెప్పాలంటే 22 క్యారెట్ కంటే 18 క్యారెట్ బంగారు ఆభరణాలే గట్టిగా ఉన్నాయని వినియోగదారులు చెప్తుండటం గమనార్హం.

**చివరగా..**

ధరలు పెరిగాయనో.. డబ్బు సరిపడా లేదనో కాకుండా మీ బడ్జెట్‌లో ఆయా రకాలలో క్యారెట్ నగలను ఆనందంగా కొనేయండి. అయితే మోసాలకు తావు లేకుండా జాగ్రత్తపడటం మాత్రం మరిచిపోవద్దు. అన్ని నాణ్యతా ప్రమాణాలు ఉన్నాయా? లేదా? అన్నది కనుక్కోవడం మంచిది. ఇక వీటిని మళ్లీ అమ్ముకున్నా.. తరుగుపోను అందులోని బంగారానికి అప్పటి రేటు ఎలాగూ లభిస్తుంది. ధర తక్కువైతే అప్పుడు మరింత హై క్యారెట్ బంగారు నగలకు అప్‌గ్రేడ్ అయిపోండి.



*రెండేండ్ల క్రితం దేశీయంగా నగల అమ్మకాల్లో 5 నుంచి 7 శాతంగా ఉన్న లో క్యారెట్ గోల్డ్ ఆర్నమెంట్స్ వాటా.. ఇప్పుడు 15% దాటిపోవడం మారిన ట్రెండ్‌కు అద్దం పడుతున్నది.*


**-సురేంద్ర మెహెతా, భారతీయ బులియన్, జ్యుయెల్లర్స్ సంఘం కార్యదర్శి**

### తేలికపాటి నగల హవా

ఒకప్పుడు నడుములు వంగిపోయేంతదాకా నగలు ధరించేవారు. భారీ డిజైన్లతో.. తులాలకొద్దీ బంగారాన్ని పెట్టుకునేవారు. కానీ ఇప్పుడు అంతంత బరువైన నగలను వేసుకొనేందుకు సంపన్నులు సైతం ఇష్టపడటం లేదు. దీంతో మార్కెట్‌లో తేలికపాటి బంగారు నగలకే ప్రస్తుతం ఎక్కువగా డిమాండ్ ఉంటున్నదని నగల వ్యాపారులు అంటున్నారు. నగల తయారీలో వచ్చిన కొత్త టెక్నాలజీ.. సంప్రదాయ, భారీ డిజైన్లనూ తక్కువ బంగారాన్ని వినియోగించి స్వల్ప బరువుకే అందుబాటులోకి తెచ్చేలా చేసిందని ప్రపంచ స్వర్ణ మండలి భారతీయ కార్యకలాపాల విభాగం సీఈవో సచిన్ జైన్ చెప్తున్నారు. మొత్తానికి లైట్ వెయిట్.. లో క్యారెట్ గోల్డ్ ఇప్పుడు పసిడి మార్కెట్‌ను శాసిస్తున్నాయనడంలో సందేహం లేదు.

### ఇదీ క్యారెట్ కథ..

- **24 క్యారెట్‌లో 99.90 శాతం స్వచ్ఛమైన పుత్తడి ఉంటుంది. దీన్నే మేలిమి బంగారంగా కూడా పిలుస్తారు. కడ్డీలు, బిస్కట్లు, నాణేల రూపంలో అమ్ముతారు.**
- **22 క్యారెట్‌లో 91.67 శాతం స్వచ్ఛత కలిగిన పసిడి లభిస్తుంది. మిగతా 8.33 శాతం (5 శాతం వెండి, 2 శాతం రాగి, 1.33 శాతం జింక్) ఇతర లోహాల మిశ్రమం ఉంటుంది. అత్యుత్తమ శ్రేణి నగల తయారీకి దీన్నే వాడుతారు.**
- **18 క్యారెట్‌లో 75 శాతం ప్యూర్ గోల్డ్ కనిపిస్తుంది. 25 శాతం ఇతర లోహాలే.**
- **14 క్యారెట్‌లో 58.33 శాతం స్వచ్ఛమైన బంగారం. 41.67 శాతం వేర్వేరు లోహాలను కలుపుతారు.**
- **10 క్యారెట్‌లో 41.67 శాతం బంగారం, 58.33 శాతం ఇతర లోహాలు.**




# సూచీలకు బడ్జెటే దిక్సూచి

**దేశీయ** స్టాక్ మార్కెట్లు రివర్స్‌గేర్‌లోనే నడుస్తున్నాయి. గత వారంలోనూ నిరాశపర్చాయి. ఇన్వెస్టర్లు అమ్మకాల ఒత్తిడిలో ఉండిపోతున్నారు. ఈ క్రమంలోనే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే గత వారం బాంబే స్టాక్ ఎక్స్చేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 428.87 పాయింట్లు లేదా 0.55 శాతం దిగజారి 76,190.46 వద్ద స్థిరపడింది. నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 111 పాయింట్లు లేదా 0.47 శాతం క్షీణించి 23,092.20 దగ్గర ఆగింది. అయితే ఈ వారం బడ్జెట్ అంచనాలు, నిర్ణయాలు.. మార్కెట్లకు దిక్సూచిగా ఉండనున్నాయి. వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2025-26)గాను ఫిబ్రవరి 1న పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ కొత్త బడ్జెట్‌ను ప్రవేశపెట్టబోతున్నారు. ఇది శనివారమైనప్పటికీ స్టాక్ మార్కెట్లలో ట్రేడింగ్ జరుగనున్నది. సాధారణంగా శని, ఆదివారాలు స్టాక్ మార్కెట్లకు సెలవు అన్న విషయం తెలిసిందే. దీంతో బడ్జెట్‌ను ఇన్వెస్టర్లు మెచ్చితే సూచీలు పైకి, లేకుంటే కిందికి అనుకోవచ్చు. ప్రధానంగా ఆయా రంగాల షేర్లను పన్నులు, ప్రోత్సాహకాలు నడిపిస్తాయని చెప్పవచ్చు. ఆదాయ పన్నుల్లో ఊరట లభిస్తే ఆటో, రియల్టీ, బ్యాంకింగ్ షేర్లకు ఊతమిచ్చినట్టే. అలాకాకున్నా ఇవే ముందుగా ప్రభావితం కావచ్చు. ఇక డాలర్‌తో పోల్చితే ఇంకా ఆమోదయోగ్యం కాని స్థాయిల్లోనే కొట్టుమిట్టాడుతున్న రూపాయి మారకం విలువ.. మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీస్తున్నది. గ్లోబల్ స్టాక్ మార్కెట్ల తీరుతెన్నులు, విదేశీ మదుపరుల పెట్టుబడులు, ముడి చమురు ధరలు, అంతర్జాతీయ పరిణామాలూ కీలకమే. కాగా, అమ్మకాల ఒత్తిడి కనిపిస్తే నిఫ్టీకి 22,700 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 22,500 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం నిఫ్టీ 23,300-23,500 స్థాయికి వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.




*గమనిక..: స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడిదొడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.*

# తపాలా పథకాలు భళా

### గరిష్ఠంగా 8.2 శాతం వడ్డీరేటు

**తపాలా** శాఖ రకరకాల పెట్టుబడి పథకాలను అందిస్తున్నది. ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డీ), రికరింగ్ డిపాజిట్ (ఆర్‌డీ), మంత్లీ ఇన్‌కమ్ డిపాజిట్ (ఎంఐడీ), సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్ (ఎస్‌సీఎస్ఎస్), సుకన్య సమృద్ధి యోజన (ఎస్ఎస్‌వై), నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ (ఎన్ఎస్‌సీ), కిసాన్ వికాస్ పత్ర (కేవీపీ), మహిళా సమ్మాన్ సేవింగ్ సర్టిఫికెట్ (ఎంఎస్ఎస్‌సీ) వంటి చిన్న మొత్తాల పొదుపు పథకాల్లో సురక్షిత పెట్టుబడులకు అవకాశం కల్పిస్తున్నది. అంతేగాక వీటికి వడ్డీరేటు 6.7 శాతం నుంచి 8.2 శాతం వరకు ఉన్నది. ఈ పథకాల ద్వారా ఇతర ప్రయోజనాలూ మదుపరులకు అందుతుండటం విశేషం.

| పథకం | వడ్డీ (%) |
|---|---|
| పోస్టాఫీస్ సేవింగ్స్ అకౌంట్ | 4.00 |
| ఏడాది, రెండేండ్ల ఎఫ్‌డీ | 6.9, 7, |
| మూడు, ఐదేండ్ల ఎఫ్‌డీ | 7.1, 7.5 |
| పోస్టాఫీస్ ఆర్‌డీ | 6.70 |
| ఎస్‌సీఎస్ఎస్ | 8.20 |
| పోస్టాఫీస్ మంత్లీ ఇన్‌కమ్ | 7.40 |
| నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ | 7.70 |
| పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ | 7.10 |
| కిసాన్ వికాస్ పత్ర | 7.50 |
| మహిళా సమ్మాన్ | 7.50 |
| సుకన్య సమృద్ధి యోజన | 8.20 |